సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం | 27 | మార్చి | 2025



క్షణ క్షణం..ఉత్కంఠ

పాస్టర్ ప్రవీణ్‌కుమార్ పగడాల మృతి సంఘటనపై బుధవారం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రి వద్ద క్షణ క్షణం ఉత్కంఠ నెలకొంది.

8లో



డెల్టా కాలువలకు నీరు విడుదల

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 10,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.55 అడుగులకు చేరింది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం (సాయంత్రం)	సహర్ శుక్రవారం (ఉదయం)
రాజమండ్రి	6.24	4.41
కాకినాడ	6.24	439
అమలాపురం	6.24	4.39

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ ఎంప్లాయిస్, పెన్షనర్ల అధ్యక్షునిగా మూలపర్తి

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగం జిల్లా అధ్యక్షునిగా మూలపర్తి ప్రభాకరరావును పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన ప్రభాకరావును జిల్లా పదవికి నియమిస్తూ బుధవారం రాత్రి నియామకపత్రాన్ని పంపించింది.

బాలబాలాజీ స్వామికి రూ.18.90 లక్షల ఆదాయం



అప్పనపల్లి ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామివారి హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 36 రోజులకు హుండీల ద్వారా స్వామివారికి రూ.18,90,148 ఆదాయం వచ్చింది. మొత్తం 8.200 గ్రాముల బంగారం, 13 గ్రాముల వెండిని భక్తులు హుండీల్లో కానుకలుగా సమర్పించారు. అమలాపురం గ్రూపు టెంపుల్స్ పర్యవేక్షణాధికారి ఆర్.శ్రీనివాస్ పర్యవేక్షణలో ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు జరిగింది. లెక్కింపులో అర్చకులు, బ్యాంక్ ఆఫ్ బరోడా ఉద్యోగులు, స్థానికులు, పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

టెన్త్‌కు 19,013 మంది హాజరు

ముమ్మిడివరం: పదో తరగతి పరీక్షల్లో భాగంగా బుధవారం ఫిజికల్ సైన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని 22 మండలాల్లో 110 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 19,132 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 19,013 మంది హాజరయ్యారు. 119 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు రాశారు. మొత్తం 18,933 మంది రెగ్యులర్, 80 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షలకు 99.38 శాతం మంది హాజరైనట్లు డీఈఓ డా.షేక్ సలీం బాషా తెలిపారు. పరీక్షా కేంద్రాలను డీఈవో డా. సలీం బాషా, డీవైఈవో జి.సూర్య ప్రకాష్, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంతరావుతో పాటు, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌ల వారు జిల్లాలో 24 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

4న ఇంటర్ మూల్యాంకనం ముగింపు

డీఐఈవో సోమశేఖరరావు



సోమశేఖరరావు, డీఐఈవో

అమలాపురం టౌన్: ఇంటర్మీడియెట్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ నాలుగో తేదీన ముగియనుందని డీఐఈవో వనుము సోమశేఖరరావు తెలిపారు. అమలాపురంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈ నెల ఏడు నుంచి పలు విడతల్లో జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ మొదలైనట్టు వివరించారు. బుధవారం నుంచి ఫస్టియర్, సెకండియర్‌కు సంబంధించి వృక్ష, జంతు, వాణిజ్య శాస్త్రాల జవాబు పత్రాల మూల్యంకనం కొనసాగుతోందని చెప్పారు. వృక్ష శాస్త్రంలో 5,108, జంతు శాస్త్రంలో 4,799, వాణిజ్య శాస్త్రంలో 3,908 జవాబు పత్రాలను దిద్దుతున్నట్టు చెప్పారు. స్పాట్ వాల్యుయేషన్ సెంటర్‌లో ఇప్పటికే తెలుగు, హిందీ, పౌర శాస్త్రం జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తయిందన్నారు. సంస్కృతం , ఇంగ్లిష్, గణితం, భౌతిక శాస్త్రం, చరిత్ర, వృక్ష, జంతు, వాణిజ్య శాస్త్రాల జవాబు పత్రాల మూల్యాంకనం కొనసాగుతోందని తెలిపారు.

ఎక్స్‌గ్రేషియా క్లెయిమ్‌కు 31 వరకు గడువు

అమలాపురం రూరల్: అసంఘటిత కార్మికులకు ఉద్దేశించిన ఈ–శ్రమ్ పోర్టల్‌లో ఎక్స్‌గ్రేషియా క్లెయిమ్ సెటిల్‌మెంట్ స్వీకరణకు ఈ నెల 31 వరకు గడువును పొడిగించినట్టు జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ టి.నాగలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెటిల్‌మెంట్ ప్రక్రియ, ఇతర నిబంధనలు, షరతులు మారవని స్పష్టం చేశారు. జిల్లా మేజిస్ట్రేట్లు ఆమోదించిన క్లెయిమ్‌లు ఈ–శ్రమ్ పోర్టల్ ఎక్స్‌గ్రేషియా మాడ్యూల్‌పై ప్రాసెస్ చేయడానికి ఈ నెల 31 వరకు గడువును కేంద్ర ఉపాధి కార్మిక శాఖ పొడిగించిందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అరకొర రాయితీ

- ప్రజల నడ్డి విరుస్తున్న వడ్డీ భారం
- పన్ను చెల్లింపునకు 50 శాతమే రాయితీ
- వైఎస్సార్ సీపీ హయాంలో 100 శాతం
- 10 ఏళ్ల కుళాయి పన్ను ఇప్పుడే చెల్లించాలంటూ ఒత్తిడి



చెల్లింపుదారులు లేక వెలవెలబోతున్న పిఠాపురం మున్సిపాలిటీ

పిఠాపురం: ఇచ్చేది గోరంత గొప్పలు చెప్పుకునేది కొండంత అన్నట్టుగా ఉంది కూటమి ప్రభుత్వం తీరు. 15 శాతం పన్నులు పెంచి పుర ప్రజలపై అధిక భారం మోపిన ప్రభుత్వం వడ్డీ రాయితీని 50 శాతం మాత్రమే ఇచ్చి ప్రజలకు ఏదో మంచి చేసినట్లుగా ప్రచారం చేసుకుంటోంది. వాస్తవానికి 100 శాతం వడ్డీ రాయితీ ఇవ్వాల్సి ఉండగా కేవలం 50 శాతం మాత్రమే ఇచ్చి ప్రజలపై భారాన్ని మోపింది. మరోపక్క 12 ఏళ్లుగా బకాయిలు ఉన్న కుళాయి పన్నును ఒకేసారి చెల్లించాలని తీవ్ర ఒత్తిడి తెస్తోంది. దీంతో పుర ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ 50 శాతం వడ్డీ రాయితీ పొందడానికి కూడా కేవలం 5 రోజుల వ్యవధి మాత్రమే ఇవ్వడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలా..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో నాలుగేళ్ల పాటు వరుసగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పన్ను బకాయిల వసూలుకు సంబంధించి 100 శాతం వడ్డీ రాయితీ కల్పించారు. అది కూడా సుమారు నెల రోజుల పాటు సమయం ఇచ్చేవారు. దీంతో పుర ప్రజలు తమ పన్ను బకాయిలను ఆర్థిక భారం లేకుండా వడ్డీ రాయితీపై చెల్లించేవారు. దీంతో సుమారు 90 శాతం పన్నులు వసూలు అయి కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ఆదాయం సమకూరేది. మొండి బకాయిలు సైతం వసూలు అయ్యేవి. 100 శాతం వడ్డీ రాయితీ కల్పించడం వల్ల అటు పన్ను చెల్లించే వారికి ఊరట లభించడంతో పాటు ఇటు పురపాలక సంఘాలకు సమయానికి ఆదాయం వచ్చి అభివృద్ధి పనులు చేసేందుకు వెసులుబాటు ఉండేది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు అర్ధ సంవత్సరంగా, అక్టోబర్ నుంచి మార్చి వరకు మరో అర్ధ సంవత్సరంగా పరిగణించి పన్నులు వసూలు చేస్తుంటారు. ఈ కాలంలో పన్నులు చెల్లించకపోతే నూటికి రూ.2లు చొప్పున వడ్డీ వసూలు చేస్తారు. మరీ మొండి బకాయిలు అయితే క్కువ స్థాయిలో వడ్డీ పేరుకుపోయి ఉంటుంది. అలాంటి వాళ్ల బకాయిలు చెల్లించాలంటే వడ్డీ పెను భారంగా మారుతుంది. అలాంటి వారికి 100 శాతం వడ్డీ రాయితీ ఎంతో మేలు చేసి వారు వెంటనే పన్నులు చెల్లించేవారు.

ప్రస్తుతం ఇలా..

ఈ ఏడాది మార్చి నెల చివరి వారంలో నెలాఖరుకు కేవలం 5 రోజులు సమయం మాత్రమే ఉండగా కూటమి ప్రభుత్వ హయాంలో వడ్డీ రాయితీ ప్రకటించారు. అది కూడా కేవలం 50 శాతం మాత్రమే రాయితీ కల్పించారు. దీంతో పన్ను చెల్లింపుదారులకు పెద్దగా కలిసి వచ్చేది కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇచ్చేది తక్కువ కాని తాము ప్రజలకు ఎంతో చేసేసినట్లు కూటమి నేతలు ఆర్భాటంగా ప్రకటనలు ఇచ్చేసుకోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. 50 శాతం వడ్డీ రాయితీ కూడా మొత్తం బకాయి చెల్లించిన వారికే వర్తిస్తుంది. దీంతో పన్నులు చెల్లించడానికి పుర ప్రజలు విముఖత చూపిస్తున్నారు. పన్నుల వసూలు కేంద్రాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

10 ఏళ్ల కుళాయి పన్ను ఇప్పుడే చెల్లించాలంటూ ఒత్తిడి

ఒకటీ రెండు కాదు.. ఏకంగా పదేళ్ల కుళాయి పన్నుకు ఒకే మారు డిమాండ్ నోటీసు ఇస్తున్నారు. ఇప్పటికే పన్నులు చెల్లించని వందల ఇళ్ల కుళాయి కనెక్షన్లు కట్ చేసేశారు. ఇన్నేళ్లూ లేని హడావుడి ఇప్పుడేమిటని ప్రజలు లబోదిబోమంటున్నారు. ఒక పిఠాపురం మున్సిపాల్టీలోనే 4,586 ఇంటి కుళాయిలు వున్నాయి. ఈ కుళాయిల నుంచి నెలకు రూ.100 నీటి చార్జీలు మున్సిపాల్టీ వసూలు చేస్తోంది. అంటే ఏడాదికి రూ.1,200 ఈ మొత్తాన్ని ఇంటి పన్నుతో పాటూ మున్సిపాల్టీ వసూలు చేయాల్సి వుంది. కేవలం ఇంటి పన్నుమాత్రం వసూలు చేస్తూ వచ్చారు. హఠాత్తుగా ఇప్పుడు ఏమైందో ఏమో ప్రతి కుళాయికీ వేలాది రూపాయలు నీటి పన్ను బకాయి వుందంటూ రెడ్ నోటీసులు జారీ చేశారు. అక్కడితో ఆగకుండా రెండు రోజుల్లో చార్జీలు చెల్లించలేదనే కారణంగా పలు ఇళ్ల కుళాయి కనెక్షన్లు తొలగించేశారు. మున్సిపాల్టీలో ఇప్పటి వరకూ కుళాయి పన్నుకు సంబంధించి రూ 3.91 కోట్లు బకాయిలు వున్నాయి. వీటిలో ఇప్పటికి కట్టింది రూ.79 లక్షలు మాత్రమే. బకాయిదారులందరికీ రెడ్ నోటీసులు జారీ చేశారు. ఈ నెలాఖరులోగా బిల్లులు కట్టాలని ఆదేశిస్తున్నారు. లేని పక్షంలో ఆస్తులు జప్తు చేస్తామని, కుళాయిలు తొలగిస్తామని , కేసులు పెడతామని హెచ్చరిస్తున్నారు. బాధితుల్లో అధిక శాతం మధ్యతరగతి వారే. ఏళ్ల తరబడి అసలు కుళాయి పన్ను విషయమే అడగకుండా ఒకేమారు బకాయిలు వున్నాయంటూ రెడ్ నోటీసులు జారీ చేయడంపై వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇలా..

కార్పొరేషన్లు	–	2 (రాజమహేంద్రవరం, కాకినాడ)
మున్సిపాలిటీలు	–	9
నగర పంచాయతీలు	–	3

వసూలు కావలసిన పన్నులు

పిఠాపురం రూ.556.49 లక్షలు, సామర్లకోట 507.99, నిడదవోలు 521.03, అమలాపురం 982.99, ఏలేశ్వరం 182.68, గొల్లప్రోలు 156.97, పెద్దాపురం 494.37, రామచంద్రపురం 501.47, రాజమహేంద్రవరం 6,942.26, తుని 538.04, కాకినాడ 5,536.00, ముమ్మిడివరం 150.91, మండపేట 668.67, కొవ్వూరు 360.22 లక్షల రూపాయల మేర పన్నులు వసూలు కావలసి ఉంది.

పేరుకే రాయితీ భారం మామూలే



అసలు వడ్డీ రాయితీ అనేది పూర్తిగా ఇవ్వాలి. గతంలో 100 శాతం వడ్డీ రాయితీ ఇచ్చేవారు. దీంతో పన్నులు చెల్లించడం ద్వారా వడ్డీ భారం తగ్గేది, కాని ఇప్పుడు పన్నులు 15 శాతం పెంచి మోయలేని భారాన్ని మోపి ఏదో ప్రజలకు మేలు చేస్తున్నట్లు చెప్పుకుంటూ కేవలం 50 శాతం రాయితీ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. దీనివల్ల ప్రజలకు ఒరిగేది ఏమీ ఉండదు. ఈ రాయితీ కూడా కేవలం ఐదు రోజుల్లో చెల్లించాలంటూ మెడపై కత్తి పెట్టినట్లుగా ఇవ్వడం ప్రజలను మోసగించడమే.

– వాపల సూర్యారావు, పిఠాపురం

వడ్డీ రాయితీ 50 శాతం మాత్రమే



ప్రభుత్వం వడ్డీ రాయితీ 50 శాతం మాత్రమే ఇచ్చింది. ఈ నెలాఖరు లోపు పన్ను బకాయిలు పూర్తిగా చెల్లించిన వారికి మాత్రమే వడ్డీ రాయితీ వర్తిస్తుంది. బకాయిలు చెల్లించని వారిపై చర్యలు ఉంటాయి.

– నాగ నరసింహారావు, మున్సిపల్ ఆర్డీ, రాజమహేంద్రవరం

రబీ ధాన్యం సేకరణకు సన్నద్ధం కావాలి

- జాయింట్ కలెక్టర్ నిషాంతి
- అధికారులు, మిల్లర్లకు ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

సాక్షి, అమలాపురం: కోనసీమ జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో ధాన్యం సేకరణకు సర్వసన్నద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అధికారులు, మిల్లర్లను కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులు, మిల్లర్ల సంఘ ప్రతినిధులతో రబీ సీజన్‌లో ధాన్యం సేకరణ ప్రక్రియపై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ, రైతు ప్రయోజనాలే లక్ష్యంగా కార్యాచరణ ఉండాలన్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని, ధాన్యం కొనుగోలుకు పటిష్ట ప్రణాళికతో సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. ధాన్యం సేకరణకు సంబంధించి వివిధ అంశాలపై క్షుణ్ణంగా సమీక్షించారు. జిల్లాలో ఈ–పంట నమోదు ఆధారంగా రబీలో 1,64,854 ఎకరాల్లో వరి సాగు చేశారని, 6,17,000 మెట్రిక్ టన్నుల మేర ధాన్యం ఉత్పత్తయ్యే అవకాశముందని తెలిపారు. ధాన్యం సేకరణకు జిల్లా స్థాయిలో జేసీ చైర్మన్‌గా, ఆర్డీవోలు, పౌర సరఫరాల డీఎం, డీఎస్ఓ, డీఏవో తదితర అధికారులు సభ్యులుగా కమిటీ ఉందన్నారు. అవకతవకలు జరిగినట్టు తేలితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ధరల స్థిరీకరణకు చర్యలు

వివిధ శాఖల అధికారులతో ధరల స్థిరీకరణ చర్యలపై డీఎస్ఓ ఎ.ఉదయ భాస్కర్ సమీక్షించారు. నిత్యావసర సరకులు, కూరగాయల ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కూరగాయలు, ఇతర పంటల ధరల పర్యవేక్షణకు వివిధ శాఖల సహకారంతో రైతులకు మద్దతు ధరతో పాటు, వినియోగదారులకు ధరలు అందుబాటులో ఉంచాలన్నారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు జవాబుదారీ చట్టం తేవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు (మధ్య వ్యక్తి)

అమలాపురం టౌన్: ప్రత్యేకించి ఎమ్మెల్యేలకు జవాబుదారీ చట్టాన్ని తెచ్చి, ఎన్నికల సమయంలో వారిచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజలే నిలదీసే వెసులుబాటు ఉండాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. అమలాపురం ప్రెస్ క్లబ్ భవనంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి మూడు నెలలకోసారి గ్రామసభలు నిర్వహిస్తే, సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారో ఎమ్మెల్యేలను నిలదీసే అవకాశం ఉంటుందన్నారు. కోనసీమలో సీపీఎం ప్రజా చైతన్య సైకిల్ యాత్రలో తాగునీటి సమస్య తీవ్రతను గుర్తించామన్నారు. తక్షణం కోనసీమకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు తాగునీటి సమస్య పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సనాతన ధర్మం పేరుతో హడావుడి చేస్తున్నారు మినహా, పల్లెల్లో తాగునీటి సమస్యలపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో పలు చమురు సంస్థలు ఇక్కడి సహజ సంపదను దోచుకుంటున్నాయి మినహా, కనీసం తాగునీటి ప్రాజెక్టులకు చేయూతనివ్వడం లేదని మండిపడ్డారు. చమురు సంస్థల సీఎస్సార్ నిధులు ప్రజాప్రతినిధులకే చాలడం లేదని దుయ్యబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల మౌలిక వసతుల కల్పనను పట్టించుకోవడం లేదన్నారు. సూపర్ సిక్స్, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, మహిళలకు ఉచిత బస్సు ఇలా అనేక హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బలరామ్, జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

త్వరలో ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు



ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎండీ ద్వారకా తిరుమలరావు

ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

అమలాపురం రూరల్: ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు, ప్రమోషన్ల ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్టు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఆర్టీసీ క్రెడిట్ కో–ఆపరేటివ్ సొసైటీ(సీసీఎస్) రాష్ట్ర సర్వసభ్య వార్షిక సమావేశం బుధవారం అమలాపురంలో జరిగింది. సొసైటీ చైర్మన్ అయిన ద్వారకా తిరుమలరావు, విజయవాడ జోన్–2 ఈడీ జి.విజయరత్నం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో మాట్లాడారు. అమలాపురం డిపో గ్యారేజ్ అన్ని అంశాల్లో గతేడాది కాలంలో లక్ష్యాలను సాధించినందుకు ఉద్యోగులను అభినందించారు. విజయరత్నం మాట్లాడుతూ, ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాకు అమలాపురం డిపో నుంచి స్పెషల్ బస్సులను ఆపరేట్ చేసి, సంస్థ ప్రతిష్టను ఇతర రాష్ట్రాలకు చేరవేశారన్నారు. అక్కడ సేవలందించిన డ్రైవర్లను, గ్యారేజ్, ట్రాఫిక్ ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కోనసీమ, కాకినాడ జిల్లాల నుంచి కుంభమేళాకు 45 స్పెషల్ బస్సులు నడిపిన డీపీటీఓ ఎం.శ్రీనివాసరావును ఎండీ, ఈడీ ప్రత్యేకంగా అభినందించారు. గ్యారేజ్ ఆవరణలో ఎండీ మామిడి మొక్కను నాటారు. తొలుత అమలాపురం డిపోను తనిఖీ చేశారు. డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి, ట్రాఫిక్, గ్యారేజ్, సెక్యూరిటీ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వినతి

ఆర్టీసీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ పీటీడీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు ఆర్టీసీ ఎండీ తిరుమలరావును కోరారు. ఈ మేరకు స్థానిక డిపోలో జిల్లా అధ్యక్షుడు ఎస్.సోమేశ్వరరావు, కార్యదర్శి పి.రవిరాజు తదితరులు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందించారు. నేరుగా జీతాలు, పనికి సమాన వేతనాలు, సుప్రీం తీర్పు అమలు, ఖాళీల భర్తీ తదితర డిమాండ్లను ఆమోదించాలని కోరారు.



క్లుప్తంగా

ఏప్రిల్ 8న సప్త జ్యోతిర్లింగ దర్శన్ ప్రత్యేక రైలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రాజా

రాజమహేంద్రవరం సిటీ: ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 8న విజయవాడ నుంచి సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర ప్రత్యేక రైలును నడుపుతున్నట్టు సంస్థ విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా తెలిపారు. బుధవారం ఆయన ఇక్కడ దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, ఈ యాత్రలో ఉజ్జయినీ(మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్), ద్వారక (నాగేశ్వర్), సోమనాథ్, పుణే(భీమశంకర్), నాసిక్ (త్రయంబకేశ్వర్), ఔరంగాబాద్ (గ్రిష్ణేశ్వర్) సందర్శన ఉంటుందని వివరించారు. ఈ రైలు విజయవాడలో బయలుదేరి ఖమ్మం, కాజీపేట, హైదరాబాద్ మీదుగా ప్రయాణిస్తుందన్నారు. ఏప్రిల్ 8న బయలుదేరే ఈ రైలు 19న తిరిగి విజయవాడ చేరుతుందని చెప్పారు. ఈ రైలులో ఎకానమీ(స్లీపర్), స్టాండర్డ్ (3ఏసీ), కంఫర్ట్ (2ఏసీ) సౌకర్యాలు ఉంటాయన్నారు. వివరాలకు 92814 95848, 92810 30714 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	15,500
గటగట (వెయ్యి)	14,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	14,500
గటగట (వెయ్యి)	13,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్షణ క్షణం..ఉత్కంఠ



రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రి వద్ద కేఏ పాల్, ప్రతాప్‌సిన్హా, పాస్టర్లు



పోస్టుమార్టం అనంతరం క్రైస్తవుల మధ్య డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పగడాల మృతదేహాన్ని తరలిస్తున్న అంబులెన్స్



రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రి ప్రధాన రహదారిపై క్రైస్తవుల ఆందోళన

- పాస్టర్ ప్రవీణ్‌కుమార్ అనుమానాస్పద మృతిపై క్రైస్తవుల ఆందోళన
- రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలివచ్చిన వేలాది మంది
- ధర్నా, రోడ్డుపై బైఠాయింపు
- సమగ్ర దర్యాప్తునకు డిమాండ్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పాస్టర్ ప్రవీణ్ కుమార్ పగడాల మృతి సంఘటనపై బుధవారం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రి వద్ద క్షణ క్షణం ఉత్కంఠ నెలకొంది. పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతి విషయం తెలిసిన క్రైస్తవులు, దళిత సంఘాల వారు వేలాది మంది రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. ఆయనది రోడ్డు ప్రమాదం కాదని, అది ముమ్మాటికీ హత్యేనని ఆందోళన చేశారు. ఉదయమే ఆస్పత్రికి చేరుకున్న ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులు ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు అందించారు. ఆస్పత్రి వద్దకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివస్తారనే ముందస్తు సమాచారం ఉన్న జిల్లా ఎస్పీ.. ఆస్పత్రి వద్ద ఉదయం నుంచి భారీగా పోలీసుల బలగాలను మోహరించారు. సంఘటన జరిగి 24 గంటలు దాటినా, ఇంకా ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని దళితులు ఆందోళన చేశారు. కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. తీవ్ర ఉద్రిక్తత నడుమ మధ్యాహ్నం 2 గంటల సమయంలో ముగ్గురు డాక్టర్ల బృందం, వీడియో రికార్డింగ్, ఇద్దరు వ్యక్తులను అనుమతించి, పోస్టుమార్టం పక్రియ పూర్తి చేశారు. తమకు న్యాయం కావాలని, సాక్ష్యాలను తారుమారు చేస్తే ఊరుకోబోమని ఆందోళనకారులు నినాదాలు చేశారు. ఆస్పత్రి వద్దకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పాస్టర్లు, క్రైస్తవ నాయకులు, ప్రవీణ్‌కుమార్ సానుభూతిపరులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ప్రభుత్వాస్పత్రి ప్రాంగణం కిక్కిరిసింది. పోలీసు బలగాలు భారీగా మోహరించి, అల్లర్లు జరగకుండా నియంత్రించాయి. పోస్టుమార్టం విభాగం సమీపంలో ఎవరినీ లోపలికి ప్రవేశించకుండా రోప్ టీం అడ్డుకుంది. జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ ప్రభుత్వాస్పత్రి వద్ద పరిస్థితిని సమీక్షించారు. ఆ సమయంలో ఆస్పత్రి వద్ద ఆందోళనకారులు.. వుయ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు. ఎస్పీ వారికి నచ్చజెప్పి, ఎవరూ అనుమానాలు పడనవసరంలేదని, పూర్తి పారదర్శకతతో కేసు విచారణ జరుగుతుందన్నారు. అనుమానాలన్నీ నివృత్తి చేస్తామని హామీ ఇచ్చారు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ, ప్రవీణ్‌కుమార్ పగడాల కేసు పారదర్శకంగా జరుగుతుందని, సమగ్ర దర్యాప్తునకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని తెలిపారు. అనంతరం సాయంత్రం 4 గంటల సమయంలో పోస్టుమార్టం పూర్తి చేసి, మృతదేహాన్ని ప్రవీణ్ కుమార్ కుటుంబ సభ్యులకు అప్పగించారు. అంబులెన్స్ ద్వారా ఆయన నివాస ప్రాంతమైన హైదరాబాద్‌కు వారు తరలించారు. పాస్టర్ మృతిపై న్యాయం కావాలంటూ క్రైస్తవులు ఆస్పత్రి బయట ధర్నా చేశారు. దీంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

ఎస్పీ ఏమన్నారంటే..

ఈ సంఘటనపై పలు విషయాలను వెల్లడించేందుకు జిల్లా ఎస్పీ స్థానిక దిశా పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. సంఘటన స్థలానికి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం వెళ్లి ఆధారాలు సేకరించాయన్నారు. కొన్ని సీసీ పుటేజీలు సేకరించామని, మరిన్ని ఆధారాలు సేకరిస్తున్నామన్నారు. ఇందుకు డీఎస్పీతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రవీణ్‌కుమార్ మోటార్ సైకిల్‌పై కిందకు పడిపోవడం, ఆ సమయంలో దుమ్ము లేవడం, అదే సమయంలో మోటారు సైకిల్ ముందు నుంచి కారు వెళ్లడం గమనించామన్నారు. ఆ కారు వివరాలు సేకరిస్తున్నామన్నారు. అలాగే మృతదేహంపై ఉన్న దుస్తులను విజయవాడ ల్యాబ్‌కు పంపామన్నారు. ఇంకా పలు ఆధారాలను సేకరించామన్నారు. ఎవరూ మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టవద్దని, అలా చేస్తే చర్యలు తప్పవన్నారు.

ఇది సహజ మరణం కాదు



పాస్టర్ ప్రవీణ్‌కుమార్‌ది రోడ్డు ప్రమాదంలో జరిగిన మరణం కాదు. ప్రమాదం జరిగిన తర్వాత ఆ ప్రాంతానికి ఎవరూ వెళ్లలేదు. మర్నాడు ఉదయం ఆ ప్రాంతానికి పోలీసులు వెళ్లినా, పూర్తి ఆధారాలు సేకరించారా అసలు. పోలీసులు, ప్రభుత్వం సరిగా స్పందించలేదు. మాకు కావాల్సిన సహకారం అందించలేదు. ఈ విషయాన్ని మతపరమైన అంశంలా కాకుండా, మానవత్వంతో ముందుకు వెళ్లాలి. ఆయన కాల్ హిస్టరీ బయటకు తేవాలి. సీసీ టీవీల్లో కొంతమేరకే ఆధారాలు ఇచ్చారు. ఆయన ముందుగానే దెబ్బలతో వచ్చి అక్కడ పడిపోయారా? రెండు తెలుగు రాష్ట్రాల క్రైస్తవుల అనుమానాలు తీర్చాలి.

– పర్ల దేవిడ్, ఒఎన్ఎస్, సువార్త ప్రసంగికులు, విజయవాడ

ఆటోను ఢీకొన్న బొలేరో



ఆటో ప్రమాదానికి కారణమైన వ్యాన్



ప్రమాదానికి గురైన ఆటో



ప్రమాదంలో గాయపడి రోదిస్తున్న క్షతగాత్రులు

- 9 మందికి తీవ్ర గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం

తాళ్లరేవు: యానాం-ద్రాక్షారామ రహదారిలోని సుంకరపాలెం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 9 మందికి తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ, స్థానికులు తెలిపిన వివరాల మేరకు, కె.గంగవరం మండలం సత్యవాడ గ్రామానికి చెందిన 13 మంది ఆటోలో ఉప్పలగుప్తంలో దినకార్యక్రమానికి బయలుదేరారు. సుంకరపాలెం పంచాయతీ అంబేడ్కర్ నగర్ వద్దకు వచ్చేసరికి, ద్రాక్షారామ నుంచి మురమళ్ల వెళుతున్న బొలేరో వ్యాన్ వెనుక నుంచి ఢీకొంది. ఆటో తిరగబడడంతో 9 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ ప్రాంతంలో హాహాకారాలు మిన్నంటాయి. స్థానికులు హుటాహుటిన అంబులెన్స్‌లో క్షతగాత్రులను యానాం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి, ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని కాకినాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో మచ్చా విజయకుమారి, మచ్చా సత్యవతి, శీకోలు అమ్మలు, నాగాబత్తుల సత్యనారాయణ, గొట్టి రాముడు, నరాల చంద్రకళ, కాశి మహాలక్ష్మి, సబ్బతి ధనలక్ష్మి, గొట్టి అక్కమ్మ చికిత్స పొందారు. వీరిలో చంద్రకళ, విజయకుమారి, సత్యవతిని మెరుగైన వైద్యం కోసం కాకినాడ రిఫర్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రత్నగిరిపై నీటి పొదుపు చర్యలు..!

అన్నవరం: రత్నగిరి వసతి సత్రాల్లో ఏసీ గదుల నిలిపివేత ఉదంతం వివాదాస్పదం కావడం, అటు దేవదాయ శాఖ కమిషనర్, ఇటు జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో.. దేవస్థానం అధికారులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. పంపా నదిలో నీటి నిల్వలు అడుగంటినందున దేవస్థానంలో నీటి వృథాని అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఈఓ వీర్ల సుబ్బారావు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా సత్యదేవుని నిత్యాన్నదాన పథకం, ప్రసాదం తయారీ(భూతాధి) విభాగం, శానిటేషన్ విభాగాల్లో నీటి వినియోగాన్ని తగ్గించాలని ఆదేశించారు. దేవస్థానం క్యాంటీన్‌ల్లో కూడా నీటిని పొదుపుగా వాడాలని ఆదేశించారు. దేవస్థానం సత్రాల్లో కుళాయిలు లీకవకుండా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. నీటి పొదుపు చర్యలపై ప్రతి రోజూ సాయంత్రం ఐదు గంటలకు దేవస్థానం డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, ఏఈఓలు నివేదికలు సమర్పించాలని ఈఓ ఆదేశించారు.

గోదావరిలో పడి మత్స్యకారుడి మృతి

యానాం: గౌతమీ గోదావరిలో చేపల వేట చేస్తూ తెప్ప పైనుంచి నదిలో పడి మత్స్యకారుడు మృతి చెందినట్టు పోలీసులు బుధవారం తెలిపారు. వారి వివరాల మేరకు, తెల్లవారుజామున స్థానిక ఫెర్రీ రోడ్డులోని జీసస్ విగ్రహం వద్ద గోదావరిలో తెప్పపై చేపల వేట సాగిస్తున్న నాతి శ్రీనివాస్(47) అదుపుతప్పి నదిలో పడిపోయాడు. గాలింపు చేపట్టగా అతడి మృతదేహం లభ్యమైంది. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీనివాసరావు మృతదేహం

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE



■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2613]

Wanted

■ రాజమండ్రి ఏరియాలో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. S : 12,000/-, 10th, 50 below, Room, Food free, ఒంటరి వారికి అవకాశం. ✆ 88014 97437, 92472 71222 [B-962]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీ: 20K. Ph : 8977639663, 8977639662 [HA-1904]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీరూం+భోజనం.HYD. 9666253675 [HA-196]

■ ప్రముఖ కంపెనీకి మీ ఇంటి నుండి పార్ట్ టైం వర్కుచేయుటకు స్త్రీ/పురుషులు కావలెను మీ పేరు వాట్సాప్ చేయగలరు సెల్.77024 73949 [R-SCA25002401]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

జీవితమే రంగస్థలం

- నాటకానికి ఆదరణ కరవు
- ఐదు తరాలుగా సురభి కంపెనీ ప్రసిద్ధి
- కళాకారులను పట్టించుకోని ప్రభుత్వం
- నేడు ప్రపంచ రంగస్థల దినోత్సవం



మాయాబజార్ నాటకంలో ఓ సన్నివేశం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రాచీన కళల్లో నాటకానికి ఉన్న ప్రాముఖ్యం అంతా ఇంతా కాదు. ప్రపంచంలో మొట్టమొదటి నాటకాన్ని ఎథెన్స్ నగరంలో డైనోసిస్ అనే థియేటర్లో ప్రదర్శించారని చరిత్రకారులు చెబుతున్నారు. భారతదేశంలో క్రీ.పూ. నాలుగో శతాబ్దంలో భరతముని రాసిన నాట్య శాస్త్రమే నాటకానికి స్ఫూర్తి అన్న వాదన కూడా లేకపోలేదు. మొట్ట మొదటి నాటకం అక్షర రూపం దాల్చింది మాత్రం సంస్కృత భాషలోనే. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం, విక్రమోర్వశీయం, మాళవికాగ్నిమిత్రం, భవభూతి రచించిన మాలతీ మాధవీయం, ఉత్తరరామ చరిత్ర ప్రాచీన నాటికలైనా ఇప్పటికీ అవి అపురూపమైనవి. ప్రపంచ థియేటర్ దినోత్సవాన్ని 1961లో ఇంటర్నేషనల్ థియేటర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభించింది. తొలి ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని 1962 మార్చి 27న నిర్వహించారు.

ఆదరణ శూన్యం

తెలుగు వారికి నటులంటే సినిమా నటులే అన్న అభిప్రాయం బలంగా నాటుకుపోయింది. నాటక కళాకారులు సినిమాల్లో రాణిస్తారేమో కానీ, సినీ నటులు నాటకాల్లో రాణించడం అంత సులువు కాదు. ఏటా నంది నాటకోత్సవాల పేరిట కొన్ని నాటకాలు వేయించి ప్రభుత్వమూ చేతులు దులుపుకొంటుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నాటక రంగాన్ని మరో మెట్టుకి తీసుకెళ్లాలంటే ప్రభుత్వమే కాదు, నాటక ప్రియులూ నడుం బిగించాల్సి ఉంది. రాజమహేంద్రవరంలో శ్రీవేంకటేశ్వర ఆనం కళాకేంద్రం నాటకాలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు నిలయం. అక్కడ అద్దె కట్టలేక నాటకాలను ప్రదర్శించలేకపోతున్నారు కళాకారులు. నాటకాలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఉచితంగా ఇవ్వాలని వారు కోరుతున్నారు.

నాటకానికి చిరునామా.. సురభి

ఈ రంగంలో వనారస గోవిందరావు సురభి సంస్థను స్థాపించి గొప్ప చరిత్రను సృష్టించారు. వందేళ్ల తర్వాత పద్మశ్రీ అవార్డు గ్రహీత సురభి బాబ్జి సురభి నాటకాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన గొప్ప వ్యక్తి. సుమారు 140 ఏళ్లుగా సురభి నాటకాలు ప్రేక్షకుల ఆదరాభిమానాలను చూరగొంటున్నాయి. నాటకానికి కొత్త మెరుగులు దిద్ది, ప్రదర్శించడానికి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ఇందుకు చాలా ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. కొత్త ప్రదర్శన చేయడానికి రూ.మూడు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు ఖర్చవుతుంది. దాతలు ముందుకొస్తే.. కొత్త ప్రదర్శనలు, సరికొత్త టెక్నాలజీతో అలరిస్తాయనడంలో సందేహం లేదు.

గత వైభవ చిహ్నం.. తెలుగు నాటకం

సినిమాలు శాసించక ముందు నాటకాలే ప్రజలకు గొప్ప వినోదాత్మక సాధనం. రేయింబవళ్లు సాగే నాటకాలను చూడడానికి జనం ఎగబడేవారు. నాటకాల నుంచి సినీ రంగానికి వెళ్లి శాసించిన వారు అనేక మంది నటీనటులున్నారు. ఇప్పుడు రంగస్థలానికి మౌలిక సౌకర్యాలు, సరైన థియేటర్లు లేవు.

పూర్వవైభవం రాదు



సోషల్ మీడియా ప్రభావంతో నాటకాలు భవిష్యత్తులో మన్నుతాయన్న నమ్మకం లేదు. ఒకప్పుడు నాటకాల ప్రదర్శన అంటేనే చెవి కోసుకునేవారు. నాటకాలను రోజుల తరబడి ప్రదర్శించే వాళ్లం. పూర్వ వైభవం కోసమే ఎదురుచూస్తున్నాం.

– కలిగట్ల వెంకటరమణ, హార్మోనిస్ట్, నాటక కళాకారుడు

నన్నయ కాలం నుంచీ..



వివిధ సంస్కృతులను, జాతులను, మనుషులను ఏకం చేసే కళావేదికే రంగస్థలం. నన్నయ కాలంలోనే తెలుగులో నాటక ప్రదర్శనలున్నాయి. తొలి నాటక కర్త, ప్రయుక్త రెండు కందుకూరే. నాటకంలో మనం ఆనందిస్తాం, దుఃఖిస్తాం, ఆలోచనలకి అంకురార్పణ చేస్తూ, స్ఫూర్తి పొందుతాం. అడపాదడపా అక్కడక్కడా నాటక ప్రదర్శనలు మినహా, నిరంతరం థియేటర్ ఆఫ్ ఆర్ట్స్‌ని స్మరించుకోవడం కనుమరుగవుతోంది.

– డాక్టర్ పీవీవీ సంజీవరావు, నాటక సాహిత్య పరిశోధకుడు

పండగ వచ్చిందంటే చాలు



దసరా, వినాయక చవితి వంటి పండగలు వచ్చాయంటే చాలు.. సత్యహరిశ్చంద్ర, వరవిక్రయం, చింతామణి, పాండవోద్యోగ విజయంలోని పద్యా లు ప్రతి ఒక్క నాలుకలపై నాట్యమాడే వి. ఆ రోజులే వేరు. మళ్లీ నాటకానికి పునర్వైభవం రావాలి. నాటక పరిషత్ వల్లే కర్ణాటక అప్పుడప్పుడైనా జీవం పోసుకుంటుంది.

– సురభి సువర్ణ, నాటక కళాకారిణి

ఐదు వేల నాటకాలు ప్రదర్శించాను



నా పేరు సురభి జయచంద్ర వర్మ. నేను సురభి నాటకసంస్థలో జన్మించాను. ఐదు వేల నాటకాలకు పైగా ప్రదర్శించాను. పది నాటకాలకు దర్శకత్వం చేశాను. సుమారు 200 నేషనల్, ఇంటర్నేషనల్ థియేటర్ ఫెస్టివల్స్‌లో పాల్గొన్నాను. కేంద్ర సంగీత నాటక అకాడమీ ఇచ్చే సంగీత నాటక అకాడమీ యువ పురస్కారాన్ని 2016లో అందుకున్న ఏకైక తెలుగు వ్యక్తిని. శ్రీవేంకటేశ్వర సురభి థియేటర్ స్వీయ సంస్థ ద్వారా ప్రదర్శనలు ఇస్తున్నాను. నాది ఆరో తరం. మా తాత, ముత్తాతలు అందించిన ఈ సురభి సంప్రదాయ కళను ముందుకు తీసుకువెళ్లడానికి కృషి చేస్తున్నాను.

– సురభి జయచంద్ర, నాటక కళాకారుడు

పుట్టినప్పటి నుంచి నటనే..



నా పేరు పర్ణిక వర్మ, నా వయసు ఎనిమిదేళ్లు. నేను విద్యాంజలి హైస్కూల్లో మూడో తరగతి చదువుతున్నాను. పుట్టిన మూడో నెలకు నేను మాయాబజార్‌లో చిన్న రాక్షసుడిగా నాటకాన్ని ప్రదర్శించాను. ఇప్పటివరకు సుమారు 500 నాటకాలు చేశాను. నేను భక్త ప్రహ్లాదలో ప్రహ్లాదుడిగా, శ్రీకృష్ణలీలలు నాటకంలో శ్రీకృష్ణుడిగా, బాల మాయాబజార్ నాటకంలో శశిరేఖగా పాత్రలు చేశాను. మా నాన్న జయచంద్ర వర్మ మా స్కూల్లో తోటి విద్యార్థులతో ప్రత్యేకంగా నాటక ప్రదర్శన చేయిస్తుంటారు.

– పర్ణిక వర్మ, బాల కళాకారిణి

టి.కొత్తపల్లి సొసైటీలో నిధుల గల్లంతు

సంఘ కార్యదర్శిపై రైతుల ఆరోపణ



టి.కొత్తపల్లి సహకార సంఘ కార్యాలయం

ఐ.పోలవరం: టి.కొత్తపల్లి వ్యవసాయ సహకార సంఘంలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయి. రైతులకు చెందాల్సిన వడ్డీ రాయితీ సహా, ఇతరత్రా నిధులను సంఘ కార్యదర్శి కె.తిరుమలకుమార్ స్వాహా చేసినట్టు రైతులు ఆరోపించారు. ఇతనిపై చర్యలు తీసుకోవాలంటూ డీసీసీబీ ఉన్నతాధికారులకు, స్థానిక ఎమ్మెల్యేకు లిఖితపూర్వకంగా రైతులు ఫిర్యాదు చేశారు. తమ పేర్లతో కూడా పెద్దఎత్తున రుణాలు తీసుకున్నట్టు వారు అనుమానం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే, టి.కొత్తపల్లి వ్యవసాయ సహకార సంఘంలో కార్యదర్శి తిరుమలకుమార్ ఎనిమిదేళ్లుగా అక్రమాలకు పాల్పడుతూ, తమకు చెందాల్సిన రాయితీలను దారి మళ్లించినట్టు రైతులు ఆరోపించారు. ఇటీవల సంఘానికి మంజూరైన రూ.24 లక్షలను కాజేశాడని, మూడు శాతం రావాల్సిన వడ్డీ రాయితీని రైతులకు ఎగనామం పెట్టాడని చెప్పారు. ఏడేళ్లుగా భవన కార్యాలయంలో నివాసం ఉంటూ, నిబంధనలకు విరుద్ధంగా హెచ్‌ఆర్‌ఏ కింద ఇప్పటివరకు సుమారు రూ.10 లక్షలు దండుకున్నాడని రైతులు ఆ ఫిర్యాదులో ఆరోపించారు. ధాన్యం విక్రయాల్లో రైతులకు చెందాల్సిన హమాలీ చార్జీలు కూడా కైంకర్యం చేసినట్టు వివరించారు. కార్యాలయ ఖర్చులు, రైతు రుణాలను తిరిగి చెల్లించే ప్రక్రియలో భారీఎత్తున అక్రమాలకు పాల్పడినట్టు రైతులు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుకు మొరపెట్టుకున్నారు. దీనిపై మురమళ్ల డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ జీబీ మోహన్‌ను వివరణ కోరగా, టి.కొత్తపల్లి రైతుల నుంచి ఫిర్యాదు అందిందని, తక్షణమే సూపర్‌వైజర్ ఎస్‌వీ శ్రీరామ్‌కుమార్‌ను విచారణ చేపట్టాలని ఆదేశించామన్నారు. నివేదిక రాగానే ఉన్నతాధికారులకు నివేదించి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉద్యోగం పేరిట టోకరా!

గ్రీవెన్స్‌ను ఆశ్రయించిన భార్యాభర్తలు



ప్రత్తిపాడులో విలేకరులతో మాట్లాడుతున్న గంగరాజు, వరలక్ష్మి దంపతులు

ప్రత్తిపాడు: తమ కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసం చేశారని ప్రత్తిపాడు గ్రామానికి చెందిన దంపతులు బొడ్డు గంగరాజు, వరలక్ష్మి ఆరోపించారు. తమ నివాసంలో బుధవారం వారు విలేకరులకు తమ గోడు వెళ్లగక్కారు. వారి వివరాల మేరకు, వీరి కుమారుడు రమేష్‌కుమార్ ఇంటర్మీడియెట్ చదివి, ఖాళీగా ఉన్నాడు. రెండేళ్ల క్రితం అతడికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామంటూ మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన గొంప రామకృష్ణ, అతడి భార్య దుర్గాప్రవీణ నమ్మించారు. ఏలూరు పట్టణానికి చెందిన పల్లా ఏసు, సంతోష్‌కుమార్‌కు ఇవ్వాలంటూ వారి వద్ద రూ.4.30 లక్షలు తీసుకున్నారు. పీఈటీ శిక్షణ తీసుకుంటే ఉద్యోగం వెంటనే వస్తుందని చెప్పడంతో, రమేష్‌కుమార్ విజయనగరంలో శిక్షణకు కూడా వెళ్లాడు. అప్పటి నుంచి రామకృష్ణ, దుర్గాప్రవీణ ముఖం చాటేశారు. దీనిపై 2023 జూలై 31న ప్రత్తిపాడు పోలీసులకు గంగరాజు, వరలక్ష్మి ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకూ ప్రయోజనం లేకపోయింది. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఇటీవల జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందజేసినట్టు గంగరాజు, వరలక్ష్మి తెలిపారు. వీరి ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామని ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



ప్రవల్లిక (ఫైల్)

తాళ్లరేవు: జి.వేమవరం గ్రామానికి చెందిన వివాహిత గండి ప్రవల్లిక(25) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు, తాళ్లరేవు మండలం జి.వేమవరం గ్రామానికి చెందిన గండి రాంబాబు, ఐ.పోలవరం మండలం జి.వేమవరానికి చెందిన సలాది ప్రవల్లిక ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. రాంబాబు ట్రావెల్స్ నడుపుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ప్రవల్లిక తండ్రి కుమార్తెను తీసుకువెళ్లేందుకు రాగా, ఎంతకూ తలుపు తీయలేదు. అక్కడే ఎదురుచూసాడు. అంతలో ఇంటికి వచ్చిన రాంబాబు లోనికి వెళ్లి పరిశీలించగా, ప్రవల్లిక బాత్రూంలో కిటికీకి వేలాడుతూ కనిపించింది. ఆమెను కాకినాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ప్రవల్లిక మూడు గర్భిణి అని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రవల్లిక కుటుంబ సభ్యులు కోరంగి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై పి.సత్యనారాయణ సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తమ కుమార్తెను కట్నం కోసం అత్తింటివారే చంపి ఉంటారని ప్రవల్లిక తల్లిదండ్రులు ఆరోపించారు. తమ కుమార్తె ఎత్తు నాలుగు అడుగులకు పైగా ఉంటుందని, కిటికీ ఎత్తు అంత కూడా లేదని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.